ప్రజాశక్తి

బుధవారం 25 జూన్ 2025 5 శ్రీ సత్యసాయి

సమస్యల పరిష్కారంపై దీక్షలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

లొసుగును పట్టేసి.. కోట్లు నొక్కేసి..!



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం కేంద్రంగా వెలుగు చూసిన నకిలీ ఈ-స్టాంపులు, ఈ-చలనాల వ్యవహారం అటు రాజకీయ, ఇటు అధికార వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇందులో కోట్లాది రూపాయాలు స్కాం జరిగినట్లు బహిర్గతం కావడం ఇప్పుడు పెద్ద చర్చనీయాంశం అయ్యింది. ఇ-స్టాంపు విధానంలో ఉన్న ఒక లొసుగును పట్టేసి కోట్ల రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి కళ్యాణదుర్గం టౌన్

ఇ-స్టాంపు తీసాక స్టాంపు డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. స్టాంపులో కనబరచిన విలువలో 0.5 శాతం స్టాంపు డ్యూటీగా ప్రభుత్వానికి చెల్లించాలి. అది ఇ-స్టాంపు తీసుకున్న తరువాత వెండర్ ద్వారా ప్రభుత్వానికి జమవుతుంది. వెండర్‌కు ఇ స్టాంపు తీసుకున్న వ్యక్తి చెల్లించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ సమయాల్లో అయితే కట్టిన స్టాంపు డ్యూటీ విలువ ప్రకారం ఉందా లేదా అన్నది రిజస్ట్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. నిబంధనల ప్రకారం చెల్లింపు జరగకపోతే తదుపరి ప్రక్రియలో ముందుకు వెళ్లదు. ఒక్క రూపాయి తక్కువ ఉన్నా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడం సాధ్యపడదు. అయితే కొలెట్రాల్ అగ్రిమెంట్, ష్యూరిటీ విషయాల్లో వచ్చే సరికి క్రాస్ చెక్‌కు అవకాశం లేకుండా ఉంది. ఏదైనా సంస్థ రుణం పొందే సమయంలో రుణదాతలకు వారి మధ్య అగ్రిమెంట్లు జరుగుతాయి. కొలెట్రాల్ అగ్రిమెంటు జరిగే సమయంలోనూ రుణ విలువపై 0.5 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. కాని దీనికి రిజిస్ట్రేషన్ శాఖ ధ్రువీకరణ ఏదీ అవసరముండదు. అంతా ఇ-స్టాంపు జారీ చేస్తున్న స్టాక్ హోల్డింగ్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ ఇచ్చే ఇ-స్టాంపుతోనే సరిపోతుంది. ఇక్కడ జారీ అయిన ఇ-స్టాంపును నేరుగా కొలెట్రాల్ చేయబడిన ఫైనాన్స్ సంస్థకుగాని, బ్యాంకుగాని రుణ గ్రహిత సంస్థలు అందజేస్తాయి. ఆ సంస్థ దీన్ని ఆన్‌లైన్ నేరుగా ధ్రువీకరించుకునే వెసలుబాటుంది. దీన్ని అవకాశంగా తీసుకుని ఎస్ఆర్ ఇన్‌ఫ్రా స్టాంపు డ్యూటీని నామమాత్రంగా చెల్లించి పనికానిచ్చేశారు. ఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు సంబంధించిన విషయంలో ఇ-స్టాంపు జారీ చేసిన వెండర్ స్టాంపు డ్యూటీని తక్కువగా చెల్లించి, ప్రింట్ తీసిన ఇ-స్టాంపులో విలువను మార్ఫింగ్ చేశారు. దీన్ని ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ యునైటెడ్ బ్యాంకుతో రూ.700 కోట్లకు అగ్రిమెంట్ చేసుకుంది. వాస్తవానికి రూ.700 కోట్లకు రూ.3.50 కోట్ల వరకు స్టాంపు డ్యూటీని చెల్లించాల్సి ఉంది. కాని వంద రూపాయలు చెల్లించి తరువాత మార్ఫింగ్ చేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ రకంగా పెద్ద సంఖ్యలో మార్ఫింగ్ చేసినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కోట్లాలోనే ప్రభుత్వ ఆదాయనికి గండికొట్టినట్టయింది. దీనిపై తిరిగి ఎస్ఆర్ ఇన్‌ఫ్రానే తమకు తెలియకుండా మోసం జరిగిందని చెబుతోంది. ఈ మోసానికి పాల్పడినట్టు చెబుతున్న వెండర్ ఇప్పుడు ఎక్కడున్నాడన్నది అంతుచిక్కని వ్యవహారంగా ఉంది. పోలీసుల అదుపులో ఉన్నట్టు ప్రచారంలో ఉన్నప్పటికీ వారి నుంచి ఎటువంటి ధ్రువీకరణా జరగలేదు. ఈ క్రమంలో ఈ వ్యవహారంలో ఎస్ఆర్ ఇన్‌ఫ్రా ప్రమేయం లేదని చెప్పించే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలున్నాయి.

తహశీల్దార్, విఆర్ఒల లాగ్‌ఇన్‌లు, రబ్బరు వేలిముద్రలు.?!

మీసేవ బాబు పలువురు తహశీల్దార్, విఆర్ఒల లాగ్‌ఇన్‌లలోకి వెళ్లి వారు చేయాల్సిన పనులు కూడా ఇతనే వ్యవహరించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినట్లు ఆరోపణలున్నాయి. పలువురు అధికారులకు సంబంధించిన రబ్బరు వేలిముద్రలను కూడా ఉపయోగించి తానే వ్యవహారాలు పూర్తి చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు తమవైపు నుంచి ఏమైన తప్పులు జరిగి ఇరుక్కుంటామా అన్న భయాందోళనలో పడ్డారు.

అంతా గప్‌చుప్..!

కోట్లాది రూపాయలు ప్రభుత్వ ఆదాయనికి గండికొట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నా అధికార యంత్రాంగం మౌనంగా ఉంది. వెండర్ భార్గవి, భర్త యల్లప్ప, ఆపరేటర్ మోహన్‌బాబును అదుపులోకి తీసుకున్నట్టు ప్రచారం జరుగుతున్నా ఇంత వరకు పోలీసు అధికారులు ధ్రువీకరించలేదు. తమ వద్దలేరని చెబుతుండటం అనేక సందేహాలకు తావిస్తోంది. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారన్న దానిపైనా రిజిస్ట్రేషన్ అధికారులు కూడా స్పందించడం లేదు. ఆరోపణలొచ్చాక కళ్యాణదుర్గం వెళ్లి పరిశీలించినట్టు రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి విజయలక్ష్మి తెలిపారు. స్టాక్ హోల్డింగ్ సంస్థ నుంచి వెండర్‌గా ఉన్న వారు అందుబాటు లేకపోవడంతో వెనుదిరిగి వచ్చినట్టు తెలిపారు. అందులో ఏమి జరిగిందన్నది తమకు తెలియదని, రిజిస్ట్రేషన్ శాఖకు స్టాక్ హోల్డింగ్ సంస్థ ద్వారా జరుగుతున్న కార్యకలాపాలకు సంబంధం లేదని వివరణిచ్చారు.

రెండు రుణాలు కాదా...ఇంకా ఉన్నాయా

ఎస్ఆర్‌సి ప్రతినిధి మీసేవ బాబు మోసాల నిర్వాహకంపై చేసిన ఫిర్యాదులో కొన్ని మాత్రమే పొందు పరిచినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రచారం జరుగుతున్న రూ.900కోట్లు, మరో రుణం రూ.20కోట్లు రుణంకు ఈ-స్టాంపులలో జరిగిన మోసాలే కాకుండా ఇంకా ఎన్నెనో ఇలాంటి మోసాలు జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2019 నుంచి ఎస్ఆర్‌సి అధినేతలకు పరిచయమైన మీసేవ బాబు వారి లావాదేవీలు, ఈ-స్టాంపుల వ్యవహారాలన్నింటినీ స్వయంగా చూసుకునేవాడని ఆసంస్థ ఇచ్చిన ఫిర్యాదులోనే పేర్కొన్నారు. అలాంటప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లానే కాకుండా రాష్ట్రం, పక్క రాష్ట్రాల్లో కూడా ఎన్నెనో కాంట్రాక్ట్ పనులకు మీసేవ బాబు సెంటర్‌లోనే ఈ-స్టాంపులు, చలనాలు తీసి ఉంటారనే చర్చ జోరుగా జరుగుతోంది. ఇలా జరిగి ఉంటే కోట్లాది రూపాయాలు అక్రమాలు జరిగాయనే ప్రచారం నడుస్తోంది. ఎన్ని ఈ-స్టాంపులు, ఈ-చలనాలు తీశారు... వాటిలో ఎంతెంత ప్రభుత్వానికి వెళ్లాల్సిన రుసుంలో మోసం జరిగింది..? అనే విషయాలు వెలుగు చూడాలంటే విచారణ సంస్థలు లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

పోలీసుల అదుపులో మరో వ్యక్తి.?

బాబు మీసేవ కేంద్రంలో కొన్నేళ్లుగా పనిచేసిన మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకున్ని మంగళవారం తెల్లవారుజామున విచారణ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. సదరు యువకుడు మాత్రం తాను అమయకుడినని, తనను అకారణంగా కేసుల్లో ఇరికించవద్దని అధికారుల వద్ద కన్నీరు పెట్టుకున్నట్లు తెలిసింది. అయితే యువకున్ని విచారణ నిమిత్తం మాత్రమే తీసుకెళ్లారా.. లేక అదుపులోకి తీసుకున్నారా అన్న విషయాలపై పోలీసులు ఎటువంటి ధ్రువీకరణా చేయలేదు.

- కొలాట్రాల్ అగ్రిమెంట్‌లో వెరిఫికేషన్ అవకాశం తక్కువ
- అదే అదునుగా ఎస్ఆర్ ఇన్‌ఫ్రా వ్యవహారంలో మోసం
- నకిలీ స్టాంప్‌ల స్కాంలో మరిన్ని అక్రమాలు అంటూ ప్రచారం

కళ్యాణదుర్గంలో మూతబడిన బాబు మీ సేవా కేంద్రం

ఎస్ఆర్‌కు సంబంధం ఉంది

తలారి రంగయ్య కళ్యాణదుర్గం వైసిపి సమన్వయకర్త.

ఎస్ఆర్‌సి అధినేతగా ఉన్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రమేయంతోనే ఈ స్టాంప్ చెల్లింపు ఎగవేత మొత్తం జరిగిందన్న వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ వ్యవహారంపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఆర్ ఇన్‌ఫ్రా తమ తప్పులేదు.. అంతా వెండర్ మీదకు తోసే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం దీనిపై సమగ్రమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాను మాత్రం ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిఘా సంస్థలకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలియజేశారు.

పనిముట్లు కూడా ఇవ్వలేరా..?

- మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి
- కార్మికుల దీక్షలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్.వెంకటేష్

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తు కార్మికులు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ టిడిపి ప్రతి పక్షంలో ఉన్న సమయంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు న్యాయం కోసం ఉద్యమిస్తే కూటమి నాయకులు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సైతం దీక్షా శిబిరానికి వచ్చి మద్దతు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారని అయితే అధికారంలోకి వచ్చిన అనంతరం అందరు కలిసి కార్మికుల చెవిలో పువ్వులు పెట్టారని అన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించక పోగా కార్మికులకు ఉద్యోగ భద్రతగా ఉన్న ఆప్కాస్ ను రద్దు చేయాలని చూస్తోందని విమర్శించారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదని అన్నారు. దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఏ క్షణంలోనైనా కార్మికులు విధులు బహిష్కరించి మెరుపు సమ్మెలోకి వెళ్తారని హెచ్చరించారు. ఈ దీక్షలకు సిఐటియు పట్టణ కన్వీనర్ రాము మద్దతు తెలిపారు. ఈ దీక్షల్లో ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాదికారి రామచంద్ర, సంయుక్త కార్యదర్శి రామాంజనప్ప, ఉపాధ్యక్షులు చంద్ర, నాయకులు బాబయ్య, మూర్తి, శంకర, చంద్రశేఖర్ కుమార్, బాలాజీ, చంద్ర, బాబయ్య, మూర్తి, శంకర, కవితమ్మ, శోభమ్మ, ఓబులమ్మతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై 'కార్పొరేట్' కుట్ర

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలు, కమిషన్ల కోసం కుట్ర చేస్తూ కాలరాస్తున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ విమర్శించారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నాలుగు లేబర్ కోడ్లు రద్దయ్యే వరకూ పోరాడుతామని తెలిపారు. జూలై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలను సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. జులై 9 జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ పాల్గొంటున్నాయని ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, స్కీం వర్కర్లు, అసంఘటిత కార్మికులు అందరూ కూడా సమ్మెను బలపరచడం ద్వారా మోడీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొడతామని అన్నారు. అధిక పనిగంటలు కార్మికుల పాలిట యమపాశాలని అనేక శాస్త్రీయ పరిశోధనలు ఘోషిస్తున్నా చంద్రబాబు చెవికి ఎక్కడం లేదని, పారిశ్రామిక మిత్రుల ప్రయోజనాలే కూటమి పెద్దలకు ముఖ్యమని విమర్శించారు. గత 15 సంవత్సరాల నుంచి రాష్ట్రంలో కనీస వేతన చట్టాన్ని సవరించ లేదని, తక్షణం సలహా మండలిని నియమించి ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించి రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చే నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్రంలో అమలు నిలుపుదల చేయకపోతే కార్మిక ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని కూటమి నేతలను హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, నాయకులు జగదీష్, మల్లికార్జునలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా : ఆర్డీవో

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలని ఆర్డీవో మహేష్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు గాని, చేర్పులు గాని, తొలగింపులుగాని సరిగా లేకుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా దరఖాస్తుకు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు జాబితా విషయంలో ఎవరికైనా అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా తెలియజేస్తే న్యాయం చేకూర్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్ బాబు, ఇడిటి ఈశ్వరయ్య, ఎన్నికల అసిస్టెంట్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిహారంపై మంత్రితో చర్చిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

నిర్వాసిత రైతులను ఆదుకోండి

మంత్రిని కోరిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

హంద్రీనీవా కాలువకు భూములు కోల్పోయిన పుట్టపర్తి ప్రాంత రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు కోరారు. అమరావతి రాజధాని సచివాలయంలో మంగళవారం నాడు మంత్రిని కలిసి పరిహారం గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీ పరిధిలోని పెద్ద కమ్మవారిపల్లికి చెందిన రైతుల భూములు ప్రభుత్వం తీసుకున్నప్పటికీ హంద్రీనీవా 9వ ప్యాకేజీకి సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు నేటికీ నష్టపరిహారం అందలేదన్నారు. అప్పట్లో కొంతమంది రైతులకు ఎకరాకు రూ.23 లక్షల పరిహారం అందించారని కొంతమంది రైతులకు మాత్రం నేటికీ అందలేదన్నారు. 2017తో పోల్చుకుంటే ఇప్పుడు ఆ భూములు విలువ పెరిగిందని, పెరిగిన ధరకు అనుగుణంగా పరిహారం పెంచి రైతులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి ఇప్పటివరకు పరిహారం అందకపోవడానికి గల కారణాలను పరిశీలించి భూములు కోల్పోయిన వారికి పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

గ్రామీణ కార్మికుల స్థితిగతులపై సర్వే

లేపాక్షి : మండలం పరిధిలోని కంచి సముద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో గ్రామీణ కార్మికుల స్థితిగతులపై సర్వేను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ సర్వే ఆధారంగా రాబోయే కాలంలో కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కృష్ణమూర్తి, రామచంద్ర, స్కీం వర్కర్లు , అంగన్వాడీలు ధనమ్మ భాగ్యమ్మ మాధవి రూప రత్నమ్మ శివమ్మ ఆశ రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు

కాలుష్యంలో క్లాసులు.. అధిక మొత్తంలో ఫీజులు...

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలోని బెల్లా పబ్లిక్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఇటుక బట్టి సమీపంలో క్లాసులు నిర్వహణపై ఎంఇఒ లక్ష్మీదేవి సీరియస్ అయ్యారు. నర్సరీ నుండి ఏడవ తరగతి వరకు నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో ఐదు అడుగుల సమీపంలోనే ఇటుక బట్టి నిర్వహించడం వల్ల దాని నుండి వచ్చే పొగతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ కారణంగా పాఠశాలలో తమ పిల్లలు చదవలేరని టీసీలు ఇవ్వాలని విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని కోరారు. దీంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను బెదిరించారు. ఈ నేపథ్యంలో నరసాపురం గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తి ఎంఇఒకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన లక్ష్మీదేవి పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. రికార్డుల తనిఖీతో పాటు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలకు సమీపంలోనే ఇటుక బట్టీలు ఉండటం, పాఠశాలకు సంబంధించి ఎటువంటి కమిటీలను నిర్వహించకపోగా అధిక మొత్తంలో ఫీజులు అధిక ధరలకు పుస్తకాలు దుస్తుల పలు పంపిణీ చేస్తున్నట్లు గుర్తించారు. వీటితోపాటు పాఠశాలలో పలు రికార్డులను పాఠశాల యాజమాన్యం అడగగా అవేం తమ వద్ద లేవని చెప్పడంతో పాఠశాల నిర్వాహకుడు వర్గీస్‌కు నోటీసులు జారీ చేశారు. దీంతోపాటు గత 15 రోజుల నుంచి టిసి ఇవ్వకుండా ఓ విద్యార్థి ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యార్థికి వెంటనే యాజమాన్యం నుండి డబ్బులు వాపసు ఇప్పించారు. రెండు రోజుల్లో పూర్తి రికార్డులతో తమను కలవాలని ఆదేశించినట్లు ఎంఇఒ తెలిపారు. ఈ పాఠశాల వద్ద కాలుష్యంపై ఉన్నత అధికారులకు నివేదికను పంపుతానని ఆమె తెలిపారు.

బెల్లా పాఠశాల యాజమాన్యానికి నోటీసు

పాఠశాల నిర్వాహకుడికి నోటీసు అందజేస్తున్న ఎంఇఒ

బస్సు ఎక్కుతున్న విద్యార్థినులు

బడిబస్సు ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆదర్శ పాఠశాల విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు బడిబస్సును మంగళవారం ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ ఇనయతుల్లా సాయంత్రం విద్యార్థుల కోసం బస్సును పంపి ఇబ్బందులు తొలగించారు. "బడి బస్సు లేక ఆదర్శ పాఠశాల విద్యార్థులు అవస్థలు" శీర్షికన మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన డిఎం బస్సు ఏర్పాటు చేశారు. సమస్యపై స్పందించిన డిఎం బడి బస్సును ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఆర్టీసీ ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీ డిపోలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సత్కరించారు. మంగళవారం డిపో మేనేజర్ ఇనయతుల్లా ట్రాఫిక్ ఇన్‌ఛార్జి హరిత ఈ సత్కార అభినందన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రోత్సాహక నగదు అందజేస్తున్నామన్నారు. టార్గెట్ కన్నా ఎక్కువ ఆదాయం సాధించిన కండక్టర్లు బి. బాబయ్య, కె.జి. నాయక్, గోపాల్ అధిక ఈపికె సాధించిన ఎక్స్‌ప్రెస్ బస్సు డ్రైవర్ కె.జి. నాయక్, పల్లె వెలుగు కండక్టర్ శ్రీరాములు, సూపర్ లగ్జరీ డ్రైవర్ రియాజ్ ఖాన్ లను అభినందించి నగదు బహుమతులు అందజేశారు. డీజల్ ఆదా చేసిన డ్రైవర్లు కే.ఎస్. వాసులు, రవి నాయక్ లను సత్కరించి నగదు అందజేశారు. వీరిని ఆదర్శంగా తీసుకొని ఇతర సిబ్బంది కూడా బాగా పనిచేసే సత్కారం పొందాలని డిఎం కోరారు. అలాగే బస్టాండులో, డిపోలో రోజు పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్న స్వీపర్లను చీరలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ ఇన్‌ఛార్జి విజయానంద్, సూపర్వైజర్లు, పలువురు కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులను సత్కరిస్తున్న అధికారులు

కెజిబివిల్లో కొత్త వెలుగులు : ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కస్తూరిబా విద్యాలయాలకు కొత్త వెలుగులు వస్తున్నాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండల కేంద్రంలో గలకస్తూరిబా పాఠశాలకు అదనపు భవనాల నిర్మాణానికి స్థలాన్ని ఆమె పరిశీలించారు. అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పిల్లలకు అనుకూలంగా ఉండే చోట భవనాలు ఉండాలని.. నిర్మాణాలు ఎలా ఉండాలన్నది అధికారులతో చర్చించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని.. వెంటనే పనులు ప్రారంభం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని ఆత్మకూరు, కురుగుంట, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి కస్తూరిబా పాఠశాలల్లో అదనపు భవనాల నిర్మాణాల కోసం ఒక్కొక్క పాఠశాలకు రూ.1.25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. ఈ అదనపు భవనాల నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

వ్యాపార భవనాల అద్దె పెంపునకు మోకాలడ్డు

నగర పంచాయతీ ఆదాయానికి గండి

శ్రీకృష్ణదేవరాయ సర్కిల్లో ఉన్న అద్దె భవనాలు

ప్రజాశక్తి-పెనుకొండ

కియా కార్ల పరిశ్రమ రాకతో పెనుకొండలో వ్యాపారం జోరందుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది ఉద్యోగ, కార్మికులు పెనుకొండలో నివాసం ఉంటున్నారు. వారి అవసరాలు కోసం నిత్యావసర వస్తువుల దుకాణాలు, దుస్తులు, సెల్ ఫోన్లు, బేకరీలు, పూలకొట్లు, బార్బర్‌షాపులు, చికెన్ సెంటర్లు వంటి దుకాణాలు విరివిగా వెలిశాయి. ఈనేపథ్యంలో పట్టణం మధ్యలో ఉన్న నగర పంచాయతీ వ్యాపార భవనాలకు డిమాండ్ అధికంగా ఉంది. ఈ భవనాలలో కొందరు తిష్ట వేసుకొని కూర్చున్నారు. మూడేళ్లకు ఒకసారి అద్దె పెంచాలనే నిబంధనను తుంగలో తొక్కి నగర పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారు. అద్దె పెంపుపై నగర పంచాయతీ చైర్మన్ అడ్డు తగులుతున్నారన్న విమర్శలున్నాయి. పలుమార్లు సమావేశాల్లో అజెండా అంశానికి ఆమోదం తెలపలేదు.

గడువు ముగిసి మూడునెలలు

నగర పంచాయతీ వ్యాపార అద్దె గదులకు మూడేళ్లకు ఒకసారి అద్దెను పెంచే నిబంధన ఉంది. ఈఏడాది మార్చి 31తో ఆ గడువు తీరిపోయింది. మూడు నెలలైనా అద్దె పెంపుపై అధికారులు చొరవ చూపడం లేదు.

అద్దె పెంపునకు అడ్డు తగుతున్న చైర్మన్

వ్యాపార సముదాయ భవనాలకు అద్దె పెంపునకు మున్సిపల్ చైర్మన్ ఉమర్ ఫరూక్ అడ్డుపడుతున్నారన్న విమర్శలున్నాయి. రెండు సమావేశాల్లో అద్దెలు పెంపు అంశాన్ని ఆమోదించలేదు. ఎందుకు అద్దె పెంపునకు అడ్డుపడుతున్నారో సరైన సమాధానం చెప్పడం లేదు. చైర్మన్ బంధువులు స్నేహితులు వ్యాపార అద్దె భవనాల్లో ఉన్నారని అందుకే అద్దె పెంపునకు ఆయన మోకాలొడ్డుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నగర పంచాయతీ ఆదాయానికి గండి

పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల సర్కిల్, తపాలా కార్యాలయం, మార్కెట్ లోపల, కోర్టు సమీపంలో 32 వ్యాపార గదులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతినెల రూ.2.40 లక్షలు అద్దెల రూపంలో నగర పంచాయతీకి ఆదాయం లభిస్తోంది. ప్రస్తుతం ఉన్న ఈ అద్దెలపై 33.1/3 శాతం అద్దె పెంచాల్సి ఉంది. అలా చేయకపోవటంతో ప్రతి నెల రూ.2.38 లక్షలు నగర పంచాయతీ ఆదాయానికి గండి పడింది.

శిథిలావస్థలో వ్యాపార భవనాలు

నగర పంచాయతీ వ్యాపార అద్దె భవనాలలో కొన్నింటికి కాలం చెల్లి శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిలో అద్దెకు ఉన్న వారు భవనాలలో మరమ్మతులు చేస్తే అద్దె పెంచి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. కొందరు ఇప్పటికే అద్దెలు ఎక్కువగా చెల్లిస్తున్నామని మరోసారి పెంచే స్థితిలో లేమని అంటున్నారు.

బినామీల చేతుల్లో అద్దె భవనాలు

నగర పంచాయతీకి చెందిన వ్యాపార భవన సముదాయాలు నిబంధనల మేరకు రిజర్వేషన్ల ప్రాతిపదికన కేటాయించాల్సి ఉంది. మేజర్ పంచాయతీ గా ఉన్న సమయంలో కొందరు బినామీల పేర్లతో వ్యాపార భవనాలను వేలంపాటలో దక్కించుకున్నారు. తక్కువ అద్దెలు నగర పంచాయతీకి చెల్లిస్తూ ఇతరులకు ఎక్కువ అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు.

శిథిలావస్థకు చేరిన భవనాల మరమ్మతులు చేపడతాం

శిథిలావస్థకు చేరుకున్న భవనాలను పరిశీలించి మరమ్మతులు చేపడతాం. కాలం చెల్లిన భవనాలను కూల్చివేసి వాటి స్థానంలో నూతన భవనాలను నిర్మిస్తాం. గడువు ముగిసినా వ్యాపార భవనాలకు అద్దెలు పెంచేందుకు ఇప్పటికే రెండు సమావేశాల్లో చర్చకు పెట్టాం. మరో సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. నిబంధనల ప్రకారం మూడేళ్లకు ఒకసారి అద్దెను పెంచాల్సుంది.

సతీష్ కుమార్,
కమిషనర్, పెనుకొండ

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి బత్తలపల్లి

మిద్దె పైకి మెటికలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారికిందపడి తలకు తీవ్ర గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుధాకర్(42) సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని మారుతి నగర్‌కు చెందిన కోనేటి సుధాకర్ ఈనెల 20న రాత్రి మిద్ది పైన పడుకునేందుకు మెటికలు ఎక్కుతూ ప్రమాదవ శాత్తు కాలు జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో సుదాకర్ తలకు దెబ్బ తగలగా కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి సుధాకర్ మృతిచెందాడు. మృతుడి భార్య కోనేటి శిరీష ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల పరిధిలోని గరుడంపల్లి గ్రామంలో మంగళవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారినుంచి 6,200 రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టుకు హాజరుపరచినట్లు చెప్పారు.

మాజీ వైస్ చైర్మన్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

గతంలో ప్రజల సౌకర్యార్థం కదిరి మునిసిపల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్ సామగ్రి అపహరించిన కేసులో మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ అజ్జుకుట్టి రాజశేఖర్ రెడ్డి పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. 2022వ సంవత్సరంలో పన్నులు చెల్లించుటకు కదిరి మున్సిపల్ ఆఫీసుకు వచ్చే ప్రజలకు కౌంటర్ వద్ద ఎండకు ఇబ్బందులు పడకుండా అప్పటి మునిసిపల్ అధికారులు వారి సౌకర్యార్థము సుమారు రెండు లక్షల రూపాయల ప్రభుత్వ వ్యయంతో తాత్కాలికంగా రేకుల షెడ్డును నిర్మించారన్నారు. ఆ తరువాత మున్సిపల్ కార్యాలయము ఆధునీకరణలో భాగంగా ఆ రేకుల షెడ్డును తాత్కాలికంగా తొలగించి వాటి ఇనుప షెడ్డు పైపులను, వాటి రేకులను పాత మునిసిపల్ ఆఫీస్ కాంపౌండ్‌లో ఉంచారన్నారు. అయితేకొద్దిరోజుల నుండి సదరు ఇనుప రేకులు అక్కడ కనిపించక పోవడముతో సంబంధిత అధికారులు వాటి గురించి ఆరాతీయగా సుమారు రెండు సంవత్సరాల క్రితం ఆసమయంలో మునిసిపల్ వైస్ చైర్మన్ గా ఉన్న అజ్జుగుట్టి రాజశేఖర్ రెడ్డి మరికొంత మందితో కలిసి తన అధికారాన్ని ఉపయోగించి సుమారు లక్ష రూపాయ విలువ గల ఇనుప రేకులను మునిసిపాలిటీ అధికారులకు ఎటువంటి సమాచారము ఇవ్వకుండా తీసుకెళ్లారన్నారు. ఈ ఘటనపైకదిరి మునిసిపల్ కమిషనర్ కె. కిరణ్ కుమార్ ఇచ్చిన పిర్యాదు మేరకు, అజ్జుగుట్టి రాజశేఖర్ రెడ్డితో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు.

ఎన్పీకుంట వైద్యాధికారిగా బాలాజీ నాయక్

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల వైద్యాధికారిగా బాలాజీ నాయక్ మంగళవార బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఆనంద్ వర్ధన్, సిహెచ్ఒ నాగలక్ష్మి, సూపర్వైజర్లు శాంతమ్మ, మహేశ్వర్ రెడ్డి, సిబ్బంది రమేష్ రెడ్డి, సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని పలు గ్రామాల్లో క్షయ వ్యాధిపై మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు సూపర్‌వైజర్ అబీద్‌బాషా తెలిపారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని కమ్మపాలెంలో ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి పట్ల ఎవరు నిర్లక్ష్యము వహించరాదని చెప్పారు. వ్యక్తి గత, పరిసరాల పరిశుభ్రత పాటించి ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని కోరారు.ఈ కార్యక్రమములో ఎంపిహెచ్ఒ కిష్టప్ప, ఆశా వర్కర్లు పద్మావతి, సుధా తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

బాల్య వివాహాలు వాటి వలన జరిగే పరిణామాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ మేరకు ధర్మవరం ఆర్‌డిఒ మహేష్ ఆధ్వర్యంలో రెవిన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి తహశీల్దార్లు సురేష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, స్వర్ణతతో పాటు ఐసిడిఎస్ అధికారులు, తదతరులు పాల్గొన్నారు,

సకాలంలో పన్నులు వసూలు చేయాలి

ప్రజాశక్తి ఓబుల దేవర చెరువు

మండలంలోని గ్రామ కార్యదర్శులు సకాలంలో పన్నులు వసూలు చేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని డిపిఒ సమత సూచించారు. మండలంలోని కొండకమర్ల గ్రామ సచివాలయంలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి సమత గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి చెత్త సేకరణతో పాటు ఇంటి పన్ను, దుకాణాల పన్ను సకాలంలో వసూలు చేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె కోరారు. గ్రామ కార్యదర్శు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

బాధితుడికి పరామర్శ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎర్రదొడ్డికి చెందిన బోయ సాంబ కదిరి ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి బాధితుడిని మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ దొనికొండ ఆనంద్ , రాష్ట్ర అధికార ప్రతినిధి వాల్మీకి మేకల శివప్రసాద్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి రొద్దం

మండలంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీలను మండల నాయకులు ఏర్పాటు చేశారు. మంగళవారం మండల కేంద్రంలోనిరుద్ర పాదాశ్రమం వద్ద మండల అబ్జర్వర్ రామ సుబ్బమ్మ ఆధ్వర్యంలో ఆయా పంచాయతీల గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, సీనియర్ నాయకులు మాధవ నాయుడు, చిన్నపయ్య, వెంకట్రాంరెడ్డి, చంద్రమౌళి, మాజీ ఎంపీపీ నరసింహులు, ట్రైలర్ ఆంజనేయులు, శ్రీనాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి ప్రతిభా విద్యార్థులు

పి. ప్రీతి బాయి

ప్రజాశక్తి -చిలమత్తూరు

మండల కేంద్రంలోని శ్రీ సాయి ఏసు విద్యానికేతన్ పాఠశాల విద్యార్థిని పి. ప్రీతి బాయి పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలో సీటు సంపాదించింది. మండలంలోని అంజనీ తండా గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె ఈ ఘనత సాధించడంతో పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ బోధనతో మండలంలో గుర్తింపు పొందుతున్న ఎస్ఎస్వైవీఎన్ పాఠశాలకి ఇది మరో గౌరవంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రీతి బాయిని అభినందించారు.

ఓబుళదేవర చెరువు : స్థానిక జడ్పీ హై స్కూల్‌లో పదోతరగతి చదివిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయురాలు శిరీష, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. భవ్య శ్రీ, దాదా పీర్, అంజిత్ కుమార్ అనే విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు చెప్పారు. భవ్య శ్రీ, అంజిత్ కుమార్ ఒంగోలు ట్రిబుల్ ఐటీ, దాదా పీర్‌కు పులివెందుల ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారని అన్నారు. పాఠశాల తరఫున వీరికి అభినందనలు తెలిపారు.

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల 10వ తరగతి విద్యార్థి గంగాదేవి ట్రిపుల్ ఐటికి ఎంపికైంది. దీంతో విద్యార్థినినిజిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి ప్రసాద్ ఉపాధ్యాయులు మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, చిన్నప్పయ్య తాహెర్ ఆలీ, బాషా, ఓబుల్ రెడ్డి, పిఇటి హరి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మందులపై అప్రమత్తంగా ఉండాలి

పొలంపిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

రైతులు మందులు, విత్తనాల కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి శ్రీహరి నాయక్ సూచించారు.మంగళవారం కదిరి రూరల్ మండలంలోనీ కుమ్మరవాండ్ల పల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటసాగుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ అధికారి మౌనిక, వేమనారాయణ రైతులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల పరిధిలోని తుంగోడు, వెలదడకల గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి విజయభారతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి విజయభారతి, ఏఈవో అలేఖ్య సంబంధిత రైతులతో కలిసి పొలాలను సందర్శించారు. పంటసాగు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, తదితరులతో పాటు రైతు సేవా కేంద్రం సిబ్బంది నగేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : మండల పరిధిలోని ఏకపాదంపల్లి, పిన్నదరి గ్రామాల్లోని రైతు సేవా కేంద్ర పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో రమేష్ నాయక్ రైతులకు పంటసాగు, తెలుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి : మండల వ్యాప్తంగా రైతుల సంక్షేమంతో పాటు వారికి నూతన వంగడాలను అవగాహన కల్పించి అధిక దిగుబడి సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏవో శ్రీకష్ణ వెల్లడించారు. పరిగి మండల నూతన వ్యవసాయ ఏవో గా బాధ్యతలు తీసుకున్న ఆయన ఏఈవో మోహన్ రెడ్డి తో పాటు హెూన్నంపల్లి, ధనాపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రైతు శ్రీధర్ పొలంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, హార్టికల్చర్,సెరికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

13న ఈడిగ విద్యార్థుల ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఆర్య ఈడిగ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈడిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థుల్లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమం జూలై 13న హిందూపురంలోని ఈడిగ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వెంకట గురుమూర్తిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లలో సంఘ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, కార్యదర్శి వినయ్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ లక్ష్మీపతి, జాయింట్ సెక్రటరీ తిరుమలేష్ పాల్గొన్నారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో నాయకులు

రాజకీయ ఉన్మాది జగన్: జనసేన

ప్రజాశక్తి-పెనుకొండ

రాజకీయ ఉన్మాది జగన్ అని పెనుకొండ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ ఈడిగ కుమార్ విమర్శించారు. మంగళవారం పట్టణంలో ని ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు.. జగన్ మోహన్ రెడ్డి కి ప్రజల సంక్షేమం కన్నా వ్యక్తిగతమే ముఖ్యమన్నారు. మాజీ ముఖ్య మంత్రి బాధ్యత లేకుండా గంజాయి, బ్లేడు, బెట్టింగ్ బ్యాచ్ లను పరామర్శించడానికి వెళ్లి ఇద్దరి మృతికి కారణమయ్యారని ఆరోపించారు. ఐదేళ్లుగా లేని అభివృద్ధి ఏడాదిలో చేసి చూపించిన కూటమి ప్రభుత్వం మీద విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి సురేష్, సంయుక్త కార్యదర్శి వెంకటేష్, సోమందేపల్లి మండల అధ్యక్షులు జబివుల్లా షేక్, పెనుకొండ మండల కన్వీనర్ మహేష్, సీనియర్ నాయకులు రాజేష్, గంగాధర్, ఖాసీం, రవికుమార్, హరి నాయక్,వీర మహిళలు శిరీష, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

సొంతమండలంలో పనిచేయడానికి వెసులుబాటు కల్పించాలి

సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - గుడిబండ

సచివాలయ ఉద్యోగులకు సొంత మండలంలో పనిచేయుటకు ప్రభుత్వం వె సులుబాటు కల్పించాలని మండలంలోని సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒ కార్యాలయ ఎఒ గంగాధర్, ఈవోఆర్డీ నాగరాజు నాయక్, డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణచక్రవర్తికి అందజేశారు. బదిలీల్లో వార్డు సచివాలయ ఉద్యోగులకు ఒక న్యాయం, గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మరొక న్యాయం ఉండటం అన్యాయమన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో దాదాపు 70 శాతం మేర ఉన్న గ్రామ సచివాలయ ఉద్యోగుల మీద కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 15 సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం తరలిపోతుంటే పట్టించుకోని ఎమ్మెల్యే : వైసిపి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

రైతులకు ఎంతో ఉపయోగపడే కృషి విజ్ఞాన కేంద్రం తరలిపోతుంటే ప్రస్తుత ఎమ్మెల్యే పల్లె సింధూర పట్టించుకోలేదని వైసీపీ నాయకులు విమర్శించారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు డీఎస్ కేశవరెడ్డి, ఏవి రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కృషి వల్ల కృషి విజ్ఞాన కేంద్రం మంజూరు అయిందన్నారు. అయితే ప్రస్తుతం ఆ కృషి విజ్ఞాన కేంద్రం ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నం జరుగుతోందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పుట్టపర్తి నియోజకవర్గం అభివద్ధి పథంలో పరుగులు పెట్టిందని తెలిపారు. జాతీయ రహదారులు రావడం జరిగిందన్నారు. సత్య సాయి క్రికెట్ అసోసియేషన్ ఏర్పాటు చేసి 20 ఎకరాలలో పుట్టపర్తిలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని సదుద్దేశంతో అడుగులు వేయడం జరిగిందన్నారు. పుట్టపర్తిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని డిపిఆర్ తయారుచేసి పిల్గ్రిమేజ్ రీ- జనరేషన్ స్పిరిచువాలిటీ ఆగ్యుమెంటేషన్ డెవలప్మెంట్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం మారడంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు మరుగున పడిపోయాయన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి స్పందించి ఈ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు కొనసాగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, ఎంపీపీ ఏవి రమణారెడ్డి, కన్వీనర్ రవి నాయక్, కౌన్సిలర్ చెరువు భాస్కర్ రెడ్డి, తోపాటు తదితర నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో నిరంతరం విద్యుత్తును సరఫరా చేసేలా చర్యలు చేపడుతామని ట్రాన్స్‌కో తిరుపతి-చీఫ్ జనరల్ మేనేజర్ వర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ధర్మవరం విద్యుత్ శాఖ కార్యాలయాలన్ని మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను కూడా వారు తనిఖీ చేశారు. పట్టణంలోని వివిధ సబ్ స్టేషన్లను సందర్శించి విద్యుత్తు సరఫరా తీరును పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వర కుమార్ విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సరఫరా విషయంలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను నేరుగా తెలుపవచ్చునని తెలిపారు. పట్టణంలోని సబ్ స్టేషన్ పనితీరుపై అధికారులు తనిఖీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ. సంపత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాం, ఏడీ లక్ష్మీ నరసింహారెడ్డి, విద్యుత్ శాఖ ఏఈలు నాగభూషణం, కొండయ్య ,జానకిరామ్ సిబ్బంది పాల్గొన్నారు.

బడిబాట

ప్రజాశక్తి - అమడగూరు

మండలంలోని మహమ్మాదాబాద్ లోని మస్తాన్ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని స్థానిక ఎస్సీ కాలనీలో చేపట్టారు. ప్రయివేటు పాఠశాలలకు దీటైన ఫలితాలు సాధించేలా పిల్లలను తీర్చిదిద్దుతామని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ం పాఠశాల సిబ్బంది రామాంజనేయులు, బాలనరసింహ, సుస్మిత, లీలావతి, సుభాషిణి.పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

తోటి ఆటో కార్మికుడు మృతి చెందడంతో ఆటో కార్మికులు తమ వంతుగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. మృతి చెందిన ఆటో కార్మికుడు భాషా ఇంటికి మంగళవారంవెళ్లి ఆర్ వి జె ఆటో యూనియన్ నాయకులు సిఐ సునీత చేతులు మీదుగా మృతుని భార్యకు రూ. 16వేలను అందజేశారు. గత వారం రోజుల క్రితం ఆటో కార్మికుడు భాష అకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని తమ వంతుగా ఆదుకోవాలని ఆ యూనియన్ నాయకులు నిర్ణయించి ఈ మేరకు ఈ ఆర్థిక సహాయం అందజేశారు. ఆ కుటుంబ పరిస్థితిని కళ్లారా చూసిన సీఐ సునీత స్పందించి తనవంతుగా 5వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కుంటిమద్ది రామాంజి, షామీర్, నారాయణస్వామి, షబ్బీర్, మూర్తి, శీనా, సాయి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సచివాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - కొత్తచెరువురూరల్

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సచివాలయ సెక్రటరీ నరేష్ (33) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. సరేష్ స్వగ్రామం ధర్మవరం మండలం చిన్నూరు బత్తలపల్లి. మంగళవారం తెల్లవారుజామున స్వగ్రామంలో ఉన్న సరేష్ గుండెపోటుకు గురయ్యాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నరేష్ గ్రూప్-2 ఫలితాల్లో క్వాలిఫై కావడంతో త్వరలోనే పోస్టింగ్ రానున్న సమయంలో ఇలా జరిగింది. నరేష్ మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గ్రామ సచివాలయ ఉద్యోగి చిన్నవయసులోనే మృతి చెందడం బాధాకరమని తోటి ఉద్యోగులు అన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండలంలోని గుండుమల గ్రామానికి చెందిన మాజీ సర్పంచి 96 ఏళ్ల వెంకటకృష్ణయ్య మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి వెంకటకృష్ణయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వెంకటకృష్ణయ్య 1987లో మడకశిర మండలంలోనే 26 గ్రామాలు కలిగిన అతిపెద్ద గ్రామపంచాయతీగా ఉన్న మెలవాయి పంచాయతీ సర్పంచిగా పనిచేశారు.

చిరంజీవిని కలవాలని దీక్ష

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని నల్లగొండ రాయినపల్లి గ్రామానికి చెందిన హెచ్. రామకృష్ణప్ప అనే వ్యక్తి తన అభిమాన హీరో మెగాస్టార్ చిరంజీవిని కలవాలని దీక్ష చేపట్టాడు. తన సొంత గ్రామంలోనే చిన్నపాటి టెంట్ ఏర్పాటు చేసుకొని దీక్షకు కూర్చున్నాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అభిమాన నటుడు చిరంజీవిని కలవడానికి అనేక సార్లు ప్రయత్నం చేసి విఫలమయ్యానని చెప్పారు. తాను సొంతంగా చిరంజీవిపై రాసుకున్న జానపద కథను ఆయనకు వివరించి సినిమా తీయాలని కోరికతో అనేక పర్యాయాలు హైదరాబాదుకు వెళ్లానని చెప్పారు. అయినా తన అభిమాన నటుడిని కలవలేక పోయానని చెప్పారు. ఆయన కలసి నా కథ తో సినిమా తీయాలని కోరుతానని అంతవరకు తన దీక్ష ఆపనని చెప్పారు.

దీక్షలో కూర్చొన్న రామకృష్ణప్ప